సాక్షి
కుమురం భీం

ఆదివారం । 31 । ఆగస్టు । 2025



ఆలోచన.. ఆవిష్కరణ 8లో▸
కాగజ్‌నగర్‌లోని సరస్వతి శిశుమందిర్‌లో జిల్లాస్థాయి గణిత విజ్ఞాన మేళా నిర్వహించారు. 236 మంది విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్ట్‌లు అందరినీ ఆలోచింపజేశాయి.



లక్షలాది మంది జీవితాల్లో.. 8లో▸
పూలాజీ బాబా హితబోధతో లక్షలాదిమంది జీవితాల్లో వెలుగులు నిండాయని పలువురు కొనియాడారు. జైనూర్ మండలం పట్నాపూర్‌లో ఆయన జయంతి నిర్వహించారు.

గరిష్టం/కనిష్టం
31.0 /24.0

వాతావరణం
సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. మోస్తారు నుంచి భారీ వర్షం కురిసే అవకాశముంది.

స్థానిక సమరానికి సై..

- సెప్టెంబర్‌లోగా ఎన్నికలు
- రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం
- ఈసీకి లేఖ రాసిన ప్రభుత్వం
- కసరత్తు చేస్తున్న యంత్రాంగం
- పల్లెల్లో ఆశావహుల్లో ఉత్సాహం



కాగజ్‌నగర్‌లో వివిధ పార్టీల ప్రతినిధులతో శనివారం సమావేశమైన ఎంపీడీవో ప్రసాద్

కౌటాల/పెంచికల్‌పేట్: ఏడాదిన్నరగా ఎప్పుడెప్పుడాని ఎదురుచూస్తున్న స్థానిక సంస్థల ఎన్నికల సంగ్రామానికి ముందడుగు పడింది. శనివారం స్థానిక సంస్థల ఎన్నికలకు తెలంగాణ కేబినెట్ ఆమోదం తెలిపింది. సెప్టెంబర్‌లోపు ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయం తీసుకుంది. ఈ క్రమంలో రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు ప్రభుత్వం లేఖ రాసింది. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో కేబినెట్ పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. 'స్థానిక' రిజర్వేషన్లలో పరిమితి ఎత్తివేయాలని నిర్ణయించింది. దీంతో రాష్ట్ర ఎన్నికల సంఘం సన్నాహాలు ప్రారంభించింది. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నామని జిల్లా అధికార యంత్రాంగం ఇప్పటికే ప్రకటించింది. తొలుత ప్రాదేశిక ఎన్నికలు, ఆ తర్వాత గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించనుండగా రాష్ట్ర ప్రభుత్వం ఇందుకు సమాయత్తమవుతోంది.

ఇప్పటికే తొలివిడత శిక్షణ పూర్తి

పంచాయతీ ఎన్నికల నిర్వహణపై జిల్లా అధికారులు ఇప్పటికే రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులు, సిబ్బందికి తొలివిడత శిక్షణ ఇచ్చారు. ఎన్నికల సన్నద్ధతలో భాగంగా కొద్ది నెలల కిందటే 10 శాతం రిజర్వ్ సిబ్బందితో కలుపుకొని మొత్తం 7,045 మందిని విధులకు ఎంపిక చేశారు. వీరిలో పీవోలుగా 3,161 మంది, ఓపీవోలుగా 3,515, స్టేజ్-2 ఆర్వోలుగా 369 మంది ఉన్నారు. 200 మంది ఓటర్లు ఉండే పోలింగ్ కేంద్రానికి ఒక పీవో, ఓపీవోను నియమిస్తారు. అంతకంటే ఎక్కువ ఓటర్లుంటే ఓపీవోలను పెంచుతారు. 650 కంటే ఎక్కువ మంది ఓటర్లుంటే మరో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేస్తారు. జిల్లా వ్యాప్తంగా 335 గ్రామపంచాయతీలు, 2,874 వార్డులున్నాయి. 15 జెడ్పీటీసీ, 127 ఎంపీటీసీ స్థానాలున్నాయి. జిల్లాలో 3,53,904 మంది ఓటర్లున్నారు. ఇప్పటికే అధికారులు పోలింగ్ కేంద్రాల గుర్తింపు, బ్యాలెట్ పేపర్ల ముద్రణ, బ్యాలెట్ బాక్స్‌లకు మరమ్మతు చేపట్టి ఎన్నికలు నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నారు. రెండు విడతల్లో నిర్వహించేందుకు కసరత్తు చేస్తున్నారు.

జిల్లా సమాచారం	మండలాలు	గ్రామపంచాయతీలు	మొత్తం వార్డులు
	15	335	2,874
జెడ్పీటీసీ స్థానాలు	**ఎంపీటీసీ స్థానాలు**	**పోలింగ్ కేంద్రాలు**	**ఓటర్లు**
15	127	2,874	3,53,904

మొదటివారంలో నోటిఫికేషన్!

2025 జూలై 1న అందుబాటులోకి వచ్చిన అసెంబ్లీ నియోజకవర్గాల ఫొటోలతో కూడిన ఓటర్ల జాబితాలను అనుసరిస్తూ వార్డుల విభజన చేస్తూ తామిచ్చిన షెడ్యూల్‌ను అనుసరించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం మంగళవారం ఇచ్చిన ఆదేశాల్లో పేర్కొంది. ఇందులో భాగంగా అధికారులు జిల్లాలోని గ్రామ పంచాయతీలు, వార్డుల వారీగా ముసాయిదా ఫొటో ఓటర్ల జాబితా రూపొందించి గ్రామపంచాయతీలు, మండల పరిషత్ కార్యాలయాల్లో ప్రదర్శించారు. శనివారం వివిధ పార్టీల ప్ర తినిధులతో ఆయా ఎంపీడీవో కార్యాలయాల్లో సమావేశాలూ నిర్వహించారు. ఈ నెల 28నుంచి 30వ తేదీ వరకు గ్రామీణ అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఓటర్ల రీఅరేంజ్‌మెంట్‌కు సంబంధించి అభ్యంతరాల స్వీకరణ, ఆదివారం ఈ అభ్యంతరాలపై డీపీవోల ద్వారా పరిష్కార ప్రక్రియ నిర్వహించనున్నారు. సెప్టెంబర్ 2న గ్రామ పంచాయతీల్లో వార్డుల వారీగా ఫొటోలతో కూడిన ఓటర్ల తుది జాబితాలను డీపీవోల ద్వారా ప్రచురణ చేయనున్నారు. కాగా, సెప్టెంబర్ మొదటి వారంలో ఎన్నికల నోటిఫికేషన్ వెలువడే అవకాశముంది.

మండలం	పంచాయతీలు
ఆసిఫాబాద్	27
జైనూర్	26
కెరమెరి	31
లింగాపూర్	14
రెబ్బెన	24
సిర్పూర్(యూ)	15
తిర్యాణి	29
వాంకిడి	28
బెజ్జూర్	22
చింతలమానెపల్లి	19
దహెగాం	24
కాగజ్‌నగర్	28
కౌటాల	20
పెంచికల్‌పేట్	12
సిర్పూర్(టి)	16
మొత్తం	335

పల్లెల్లో వేడెక్కుతున్న రాజకీయం

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతాయని అందరూ భావించారు. ఇతర పార్టీల నుంచి ఒత్తిడితో పాటు మండలాలు, గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడడంతో ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం భావించినా సాధ్యపడలేదు. ప్రస్తుతం సెప్టెంబర్‌లోపు ఎన్నికల నిర్వహణకు సిద్ధ పడుతుండగా రిజర్వేషన్ కలిసి వస్తే పోటీలో ఉండాలని భావిస్తున్న వారంతా ఓటర్లను మచ్చిక చేసుకునే పనిలో పడ్డారు. దీంతో గ్రామాల్లో రాజకీయం వేడెక్కుతోంది.

న్యూస్‌రీల్

నిషేధిత గడ్డి మందు పట్టివేత



పట్టుబడిన గడ్డి మందుతో ఎస్సై మహేందర్

వాంకిడి: మహారాష్ట్ర నుంచి అక్రమంగా తరలిస్తున్న నిషేధిత గడ్డి మందును పోలీసులు శనివారం రాత్రి పట్టుకున్నారు. ఎస్సై మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. పక్కా సమాచారంతో మండలంలోని ఆర్టీఏ చెక్‌పోస్ట్ వద్ద వ్యవసాయాధికారులతో కలిసి వాహనాల తనిఖీ చేపట్టారు. మహారాష్ట్ర వైపు నుంచి వచ్చిన కారు తనిఖీ చేయగా హైజాక్, రౌండప్, క్లింటన్ పేర్లతోగల 243 లీటర్ల నిషేధిత ద్రావణపు గడ్డి మందు, టాపర్ పేరిట గల 120కిలోల పొడి గడ్డిమందు లభ్యం కాగా, విలువ రూ.1,48,390 ఉంటుంది. గడ్డిమందు తరలిస్తున్న ఇద్దరిరిని, కారును అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

'ఆదర్శ'లో స్పాట్ అడ్మిషన్లు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్, కళాశాలలో మిగిలి ఉన్న సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్లు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మహేశ్వర్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎనిమిదో తరగతిలో మూడు, తొమ్మిదో తరగతిలో నాలుగు, పదో తరగతిలో ఒకటి, ఇంటర్ ఫస్టియర్ ఎంఈసీలో 12 సీట్లు ఖాళీగా ఉన్నట్లు పేర్కొన్నారు. ఆసక్తిగల విద్యార్థులు సెప్టెంబర్ 4లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

సత్ప్రవర్తనతో మెలగాలి



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి యువరాజ

ఆసిఫాబాద్‌అర్బన్: వివిధ కారణాలతో జైలు జీవితం అనుభవిస్తున్న ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలని సీనియర్ సివిల్ జడ్జి యువరాజ సూచించారు. శనివారం జిల్లా కేంద్రంలోని సబ్‌జైలులో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్షణికావేశంలో అనాలోచితంగా చేసిన తప్పులకు జీవితాంతం బాధపడాల్సి వస్తుందని, అందుకే ఆవేశపూరితంగా తప్పులు చేయకూడదని సూచించారు. అనంతరం జైలులోని వంట గదిని పరిశీలించారు. ఖైదీల ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు. సబ్ జైలు సూపరింటెండెంట్ ప్రేమ్‌కుమార్, డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ వెంకటేశ్వర్లు, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ అంజనీదేవి తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టంపై సర్వే



ఎల్కపల్లిలో సర్వే చేస్తున్న ఏఈవో

పెంచికల్‌పేట్: మండలంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నష్టపోయిన పంటలను శనివారం ఏఈవో శ్రీవిద్య పరిశీలించారు. మండలంలోని ఎల్కపల్లి గ్రామ శివారులో నష్టపోయిన పంటలను పరిశీలించి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పెద్దవాగు పరీవాహక ప్రాంతాల్లో పంటలు పరిశీలించి రైతుల వివరాలు నమోదు చేస్తున్నామని తెలిపారు. పంట నష్టపోయిన రైతులు నమోదు చేయించుకోవాలని సూచించారు.

వివరాలు నమోదు చేసుకోవాలి

లింగాపూర్: రైతులు వానాకాలం సాగు చేసిన పంటల వివరాలు నమోదు చేసుకోవాలని ఏవో సంజయ్‌కుమార్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని రైతులు సాగు చేస్తున్న పంటల వివరాలు రైతువేదికలో ఏఈవోలను సంప్రదించి నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాల నమోదుతో ఏయే పంటలు మండలంలో ఎంత విస్తీర్ణంలో సాగవుతున్నాయో తెలుస్తాయని పేర్కొన్నారు.

అభ్యసన సామర్థ్యాలు పెంచాలి

- అడిషనల్ కలెక్టర్ దీపక్ తివారి
- పలు ప్రభుత్వ పాఠశాలల తనిఖీ

పెంచికల్‌పేట్: విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు పెంపొందించాలని స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ దీపక్ తివారి సూచించారు. శనివారం పెంచికల్‌పేట్ గ్రామంలో పర్యటించారు. ప్రాథమిక పాఠశాలను సందర్శించి రికార్డులు పరిశీలించారు. విద్యార్థుల సామర్థ్యాలు తెలుసుకుని సంతృప్తి వ్యక్తంజేశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు పరిశీలించారు. పనులు వేగవంతంగా పూర్తి చేయించి లబ్ధిదారులకు సకాలంలో బిల్లులు అందించేలా చొరవ చూపాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అంగన్‌వాడీ భవనం, పాఠశాలలో మూత్రశాలలు, కిచెన్ షెడ్, డ్రైన్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని గ్రామస్తులు అడిషనల్ కలెక్టర్‌ను ఈ సందర్భంగా కోరారు. త్వరగా కూలి చెల్లించేలా చూడాలని ఉపాధిహామీ కూలీలు ఆయనకు విన్నవించారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అదనపు కలెక్టర్ వారికి హామీ ఇచ్చారు. ఆయన వెంట క్వాలిటీ కోఆర్డినేటర్ శ్రీనివాస్, ఎంపీడీవో అల్బర్ట్, ఏఈ సందీప్, హెచ్ఎం యాదగిరి, ఉపాధ్యాయురాలు ప్రియాంక తదితరులున్నారు.



దహెగాం: పాఠశాలలో రికార్డులు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

విద్యార్థుల హాజరుశాతం పెంచాలి

దహెగాం: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరుశాతం పెంచాలని అడిషనల్ కలెక్టర్ దీపక్ తివారి సూచించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. హాజరు రిజిష్టర్లు పరిశీలించి పలువురు పదో తరగతి విద్యార్థులు దీర్ఘకాలికంగా ఎందుకు గైర్హాజరవుతున్నారని సిబ్బందిని ప్రశ్నించారు. ప్రతిరోజూ వచ్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం తరగతి గదిలోకి వెళ్లి డిజిటల్ తరగతులను వీక్షించారు. బోధన తీరును విద్యార్థుల ద్వారా తెలుసుకున్నారు. వంట గదుల కోసం ప్రతిపాదనలు అందించాలని సూచించారు. ఆయన వెంట ఎంపీడీవో రాజేందర్, ఎంఈవో శ్రీనివాస్ ఉన్నారు.

సీపీఎస్ రద్దు చేయాలని డిమాండ్

కాగజ్‌నగర్ టౌన్: సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునఃరుద్ధరించాలని టీజీ ఈజేఏసీ జిల్లా చైర్మన్ జయదేవ్ అబ్రహం డిమాండ్ చేశారు. శనివారం కాగజ్‌నగర్ పట్టణంలోని రిటైర్డ్ ఉద్యోగుల సంఘ భవనంలో టీజీఈజేఏసీ ఆధ్వర్యంలో పెన్షన్ విద్రోహ దినం, పాత పెన్షన్ సాధన పోరాట సభ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయ, కార్మిక పెన్షనర్ల ఐక్యవేదిక పిలుపు మేరకు సెప్టెంబర్ 1న కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమం తలపెట్టినట్లు తెలిపారు. హైదరాబాద్‌లోని ఆర్టీసీ కళాభవన్‌లో పెన్షన్ సాధన పోరాట సభ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఉపాధ్యాయులు అధికసంఖ్యలో హాజరుకావాలని కోరారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన సీపీఎస్ రద్దు, పాత పెన్షన్ విధానం పునఃరుద్ధరణ హామీ నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌రావు, శాంతికుమారి, శివప్రసాద్, నర్సయ్య, లింగమ్మ, నర్సయ్య, మురళీధర్‌రావు, పురుషోత్తం, రాజ్‌కమలాకర్‌రెడ్డి, మహిపాల్, మహేశ్, ఉదయ్‌కుమార్, విస్తారు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

'రద్దు చేసేదాకా పోరాడుతాం'

రెబ్బెన: ఉద్యోగ, ఉపాధ్యాయుల హక్కుకు విఘాతంగా మారిన సీపీఎస్‌ను రద్దు చేసే వరకు పోరాడుతామని టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్ తెలిపారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పాత పెన్షన్ సాధన పోరాట సభ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సెప్టెంబర్ 1న పెన్షన్ విద్రోహ దినాన్ని నిర్వహించాలని తెలిపారు. కలెక్టరేట్ వద్ద నిర్వహించనున్న ధర్నాకు జిల్లాలోని ఉద్యోగ, ఉపాధ్యాయులు అధికసంఖ్యలో హాజరుకావాలని పిలుపునిచ్చారు. సంఘం నాయకులు మేడి చరణ్‌దాస్, దూడ రాజనర్సుబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో అల్పాహారం

- అమలుకు ప్రభుత్వం కసరత్తు
- హాజరు పెంపునకు దోహదం

తిర్యాణి: అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రభుత్వం చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు ఒకపూట సంపూర్ణ పోషకాహారం అందిస్తోంది. చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యను బోధిస్తోంది. కేంద్రాలను మరింత బలోపేతం చేసేందుకు సర్కారు కసరత్తు చేస్తోంది. కేంద్రాల్లో మరో కొత్త పథకం అమలుకు చర్యలు చేపట్టింది. ఇప్పటివరకు ఒకపూట (మధ్యాహ్నం) మాత్రమే చిన్నారులకు పౌష్టికాహారం అందిస్తుండగా అదనంగా ఉదయం పూట అల్పాహారం అందించాలని నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు వారం క్రితం మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క హైదరాబాద్‌లో సంబంధిత శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కాగా, ఇప్పటికే హైదరాబాద్ నగర పరిధిలోని 139 అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రభుత్వం ఈ పథకం అమలు చేస్తోంది. అక్కడ మెరుగైన ఫలితాలు రావడంతో రాష్ట్ర వ్యాప్తంగా దీనిని అమలు చేసేందుకు కసరత్తు చేస్తోంది.

ఏజెన్సీల్లో ఎంతో ఉపయోగం

జిల్లాలోని ఐదు ఐసీడీఎస్ సెక్టార్ల పరిధిలో 973 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వీటిలో 3-6 ఏళ్ల లోపు 22,817 మంది చిన్నారులు ఆటపాటలతో కూడిన విద్యను అభ్యసిస్తున్నారు. కాగా, చిన్నారుల హాజరు పూర్తి స్థాయిలో నమోదు కావడం లేదు. హాజరు శాతం సగటున 72 శాతం నమోదవుతోంది. ఈ సమస్యకు చెక్ పెట్టేందుకు గాను అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు అల్పాహారం అందించేందుకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నది. నూతనంగా అందించనున్న అల్పాహారం ద్వారా చిన్నారులు కేంద్రాలకు వచ్చేందుకు ఆసక్తి చూపే అవకాశముంది. తద్వారా హాజరు శాతం పెరగడంతో పాటుగా వారి శారీరక పెరుగుదల (ఆరోగ్యం) కూడా మెరుగుపడుతుందని అధికారులు భావిస్తున్నారు. కాగా, ఈ పథకం జిల్లాలోని వెనుకబడిన ఏజెన్సీ ప్రాంతాల్లోని చిన్నారులకు ఎంతగానో ఉపయోగకరంగా మారనుంది. జిల్లాలో 973 కేంద్రాలుండగా 352 కేంద్రాలకే సొంత భవనాలున్నాయి. 296 కేంద్రాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. మిగతా 325 కేంద్రాలను ప్రభుత్వ పాఠశాలలు, పంచాయతీ భవనాల్లో నిర్వహిస్తున్నారు. అయితే అద్దె భవనాల్లో కొనసాగుతున్న కేంద్రాలకు పక్కా భవనాలు నిర్మించేందుకు ఒక్కోదానికి రూ.12లక్షలు మంజూరు చేయనున్నట్లు మంత్రి ఇటీవల నిర్వహించిన సమీక్షా సమావేశంలో ప్రకటించారు.



ఆసిఫాబాద్ మండలం దానాపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో భోజనం చేస్తున్న చిన్నారులు (ఫైల్)

జిల్లాలోని అంగన్‌వాడీల వివరాలు	
ఐసీడీఎస్ సెక్టార్లు	5
అంగన్‌వాడీ కేంద్రాలు	973
పక్కా భవనాలున్నవి	352
చిన్నారుల సంఖ్య	22,817

ఇంకా ఉత్తర్వులు అందలేదు

జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అల్పాహారం అందించే విషయంపై అధికారికంగా ఇంకా ఎలాంటి ఉత్తర్వులు అందలేదు. ప్రస్తుతం హైదరాబాద్‌లోని కొన్ని కేంద్రాల్లో ప్రభుత్వం ప్రయోగాత్మకంగా పథకం నిర్వహిస్తోంది. జిల్లాలోనూ అమలైతే ఎంతో బాగుంటుంది.
– భాస్కర్, జిల్లా మహిళా శిశు సంక్షేమశాఖ అధికారి

యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా



అందవెల్లి పెద్దవాగుకు ఇసుక కోసం వచ్చిన పదుల సంఖ్యలో ట్రాక్టర్లు

కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ మండలంలోని అందవెల్లి పెద్దవాగు నుంచి అక్రమంగా ఇసుక రవాణా కొనసాగుతోంది. నిత్యం పదుల సంఖ్యలో ట్రాక్టర్ల ద్వారా ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నా అధికారులు చూడనట్లు వ్యవహరించడం అనుమానాలకు తావిస్తోంది. కొద్దిరోజుల క్రితం సబ్ కలెక్టర్ శ్రద్ధాశుక్లా ఇసుక అక్రమ రవాణా చేసే ట్రాక్టర్లను పట్టుకుని సీజ్ చేశారు. అయినప్పటికీ అనుమతి లేకుండా ట్రాక్టర్ల యజమానులు యథావిధిగా ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారు. ట్రాక్టర్ యజమానులకు బడా నాయకుల అండదండలు ఉండడంతో యథేచ్ఛగా ఇసుక రవాణా కొనసాగుతోందనే ఆరోపణలున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని కోరుతున్నారు.

వందేభారత్‌కు హాల్టింగ్

- మంచిర్యాల, సిర్పూర్ కాగజ్‌నగర్‌లో నిలుపుదల
- నాగ్‌పూర్–సికింద్రాబాద్ మధ్య రైలు ప్రయాణం
- ఏడాదిగా ఇస్తున్న వినతులకు స్పందించిన రైల్వే

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: సికింద్రాబాద్–నాగ్‌పూర్ వందేభారత్ ఎక్స్‌ప్రెస్ ఎట్టకేలకు మంచిర్యాల, సిర్పూర్ కాగజ్‌నగర్ రైల్వేస్టేషన్లలో నిలుపుదలకు రైల్వేశాఖ పచ్చజెండా ఊపింది. ఏడాదిగా మంచిర్యాల, సిర్పూర్ కాగజ్‌నగర్‌తోపాటు బెల్లంపల్లి రైల్వేస్టేషన్లలోనూ హాల్టింగ్ ఇవ్వాలని కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల వాసులు వినతిపత్రాలు ఇస్తున్నారు. మరోవైపు పెద్దపల్లి, ఆదిలాబాద్ ఎంపీలు, సిర్పూర్ ఎమ్మెల్యేతో సహా బీజేపీ నాయకులు, స్థానిక నాయకులు, ఉత్తర తెలంగాణ రైల్వే ఫోరం ప్రతినిధులు అనేకసార్లు ఉన్నతాధికారులను కలిసి హాల్టింగ్ ఇవ్వాలని కోరారు. ఇక్కడి ప్రయాణికుల డిమాండ్లపై 'సాక్షి'లోనూ పలుసార్లు కథనాలు ప్రచురితమయ్యాయి. ఈ క్రమంలో మంచిర్యాల, కాగజ్‌నగర్‌లో నిలుపుదలకు రైల్వే బోర్డు ఆమోదం తెలుపుతూ ఉత్తర్వులు జారీ చేసింది. మొదట ప్రయోగాత్మకంగా హాల్టింగ్ ఇవ్వనున్నారు. ఆ తర్వాత రెండు స్టేషన్లలోని టికెట్ల ఆదాయం పరిగణనలోకి తీసుకుని పొడిగింపు నిర్ణయం తీసుకుంటారు. అయితే ఇంకా ఏ రోజు నుంచి రైలును నిలుపుదల చేస్తారనే తేదీని ప్రకటించలేదు. కొద్ది రోజుల్లోనే రైలును నిలిపే అవకాశాలున్నాయి.

రైలు ఆగక, ఆదాయం లేక..

భారత రైల్వేలో ఆధునిక వసతులు, సౌకర్యవంతమైన ప్రయాణం అందిస్తున్న వందేభారత్ రైళ్లు ఎంపిక చేసిన మార్గాల్లో నడుస్తున్నాయి. గతేడాది సెప్టెంబర్ 16న సికింద్రాబాద్–నాగ్‌పూర్ మధ్య అందుబాటులోకి వచ్చింది. సికింద్రాబాద్, కాజీపేట, రామగుండం స్టాప్‌లు ఇచ్చి తర్వాత నేరుగా మహారాష్ట్రలో బల్లార్షా, చంద్రాపూర్, సేవాగ్రామ్, నాగ్‌పూర్‌కు చేరుకుంటుంది. మొదట ఆరెంజ్ రంగులో 20కోచ్‌లతో నడిచింది. ఈ మార్గంలో ప్రయాణికుల ఆదరణ లేక ఆదాయం తగ్గిపోయింది. ఈ రైలు మొత్తం సీట్లలో 40శాతంలోపే ప్రయాణికులతో నడుస్తోంది. దీంతో 8కోచ్‌లకు కుదించి రైలును తెల్ల రంగులోకి మార్చారు. మరోవైపు ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల్లో 8 స్టేషన్ల పరిధిలో ఎక్కడా స్టాప్‌లు ఇవ్వకపోవడంతో ఈ ప్రాంత వాసులు తీవ్ర నిరాశకు గురయ్యారు. తాజా ఉత్తర్వులతో ఈ రెండు జిల్లాల నుంచి ఉదయం పూట వెళ్లే మార్గంలో కాజీపేట, సికింద్రాబాద్ వరకు వెళ్లొచ్చు. అలాగే తిరుగు ప్రయాణంలో సాయంత్రం నాగ్‌పూర్ వైపు సికింద్రాబాద్ నుంచి మంచిర్యాల, కాగజ్‌నగర్‌తోపాటు బల్లార్షా, చంద్రాపూర్, నాగ్‌పూర్ వరకు ఈ రెండు జిల్లాల ప్రయాణికులకు వీలు కలుగుతుంది. సౌకర్యవంతమైన ప్రయాణంతోపాటు వేగంగా వెళ్లే అవకాశం ఉండడంతో వందేభారత్ రైలును ఈ రెండు స్టేషన్లలో ఆపాలనే డిమాండ్లు వచ్చాయి.



వందేభారత్ రైలు



సాక్షిలో ప్రచురించిన కథనం

ఫలించిన వినతులు

సికింద్రాబాద్ నుంచి నాగ్‌పూర్ మధ్య నడిచే గోరఖ్‌పూర్, తెలంగాణ, హజ్రత్ నిజాముద్దీన్, జమ్ముతావి, దానాపూర్, సూపర్ ఫాస్ట్‌తోపాటు పలు రైళ్లు అరగంట అటు ఇటుగా అన్నీ 7గంటల నుంచి 8గంటల మధ్య ప్రయాణ సమయం పడుతోంది. ఇదే తరహాలో వందేభారత్ ఏడున్నర గంటలు పడుతోంది. అయితే మంచిర్యాల, బెల్లంపల్లి తదితర చోట్ల స్టాప్‌లు లేకపోగా, ప్రయాణికులతో ప్రస్తుతం అందుబాటులో ఉన్న అన్ని రైళ్లు కిక్కిరిసి ఉంటున్నాయి. రిజర్వేషన్లు కూడా దొరకని పరిస్థితి. వందేభారత్‌కు టికెట్ ధర అధికం కావడం, సౌకర్యాలు అధికంగా ఉండడం, స్టాప్‌లు తక్కువగా ఉండడంతో ప్రయాణికులకు సుఖవంతంగా ప్రయాణం ఉంటుంది. దీంతో వందేభారత్ రైలు ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల పరిధిలో నిలుపుదల చేయాలని పెద్ద ఎత్తున డిమాండ్లు వచ్చాయి. ప్రయాణికుల వినతుల మేరకు రైల్వే శాఖ ఆమోదం లభించింది.

సౌకర్యవంతంగా ఉంటుంది



కాగజ్‌నగర్ టౌన్/కాగజ్‌నగర్ రూరల్: వందేభారత్ రైలుకు కాగజ్‌నగర్‌తో పాటు మంచిర్యాలలో హాల్టింగ్ ఇవ్వడం ఎంతో సంతోషకరం. ప్రతీరోజు నేను మంచిర్యాల నుంచి కాగజ్‌నర్‌కు విధుల నిమిత్తం వస్తుంటాను. ఉదయం మంచిర్యాల నుంచి కాగజ్‌నగర్ వచ్చేందుకు సూపర్ ఫాస్ట్ రైళ్లు లేకపోవడంతో ఇబ్బందులకు గురయ్యేవాళ్లం. వందేభారత్ రైలు హాల్టింగ్‌తో మా సమస్య తీరిపోనుంది.
– కే రమేశ్, మంచిర్యాల

త్వరలోనే సౌకర్యం



కాగజ్‌నగర్ టౌన్/కాగజ్‌నగర్ రూరల్: దసరా పండుగకు కాగజ్‌నగర్ ప్రజలకు రైల్వే అధికారులు శుభవార్త అందించనున్నారు. వందేభారత్ రైలు కాగజ్‌నగర్ స్టేషన్‌లో హాల్టింగ్ సౌకర్యం కల్పించేందుకు రైల్వే అధికారులు ఇందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం అందింది. వందేభారత్ రైలు హాల్టింగ్‌తో వ్యాపారస్తులతో పాటు ప్రయాణికులకు ఎంతో సౌకర్యంగా మారనుంది.
– ప్రయాగ్ తివారి, రైల్వే యాత్రి సేవా సమితి అధ్యక్షుడు

సహకారానికి కృతజ్ఞతలు



కాగజ్‌నగర్ టౌన్/కాగజ్‌నగర్ రూరల్: కాగజ్‌నగర్ స్టేషన్‌లో వందే భారత్ హాల్టింగ్ కోసం సహకరించిన రైల్వే అధికారులు, కేంద్ర మంత్రులకు రుణపడి ఉంటాం. తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దుల్లోని కాగజ్‌నగర్ స్టేషన్‌లో వందే భారత్ ఎక్స్‌ప్రెస్ హాల్టింగ్ ఇవ్వాలని పలుసార్లు రైల్వే ఉన్నతాధికారులను కలిసి విన్నవించాం. వ్యాపారులకు ఈ రైలు ఎంతో సౌకర్యంగా ఉంటుంది.
– పాల్వాయి హరీశ్‌బాబు, సిర్పూర్ ఎమ్మెల్యే

క్లుప్తంగా

గంజాయి సాగు చేసిన ఒకరి రిమాండ్



నిందితుడిని చూపిస్తున్న సీఐ వెంకటేశ్వర్‌రావ్

బజార్‌హత్నూర్: మండలంలోని గంగాపూర్‌కు చెందిన బాలేరావ్ అనిల్ టెంబి గ్రామ శివారులో గల తన పత్తి చేనులో 60 గంజాయి మొక్కలు పెంచారు. విషయం తెలుసుకున్న బోథ్ సీఐ వెంకటేశ్వర్‌రావ్ శనివారం ఎస్సై సంజయ్ కుమార్‌తో కలిసి వెళ్లి గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు అనిల్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. గంజాయి మొక్కల విలువ రూ.3 లక్షలు ఉంటుందన్నారు.

విద్యుత్ కేబుల్ చోరీ

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియా ఎస్సార్పీ 3 గని సమీపంలోని సబ్‌స్టేషన్‌కు చెందిన సుమారు 60 మీటర్ల కాపర్ విద్యుత్ కేబుల్ చోరీకి గురైంది. శుక్రవారం రాత్రి దొంగలు సబ్‌స్టేషన్ నుంచి గనికి సరఫరా అయ్యే కేబుల్‌ను కత్తిరించి ఎత్తుకెళ్లారు. దీని విలువ రూ.లక్ష వరకు ఉంటుందని కార్మికులు పేర్కొంటున్నారు. కేబుల్ కట్ చేయడంతో గనికి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. వర్క్‌షాప్ విద్యుత్ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో చోరీ విషయం బయటపడింది. ఈ విషయమై ఏరియా సెక్యూరిటీ అధికారి జక్కారెడ్డిని సంప్రదించగా దొంగతనం జరిగినట్లు ధ్రువీకరించారు. దీనిపై ఇంకా ఫిర్యాదు రాలేదని శ్రీరాంపూర్ పోలీసులు తెలిపారు.

మోసగించి డబ్బులు కాజేసిన వ్యక్తి అరెస్ట్

ఉట్నూర్‌రూరల్: మోసగించి డబ్బులు కాజేసిన మండల కేంద్రంలోని బోయవాడకు చెందిన ఠాగూర్ విజయ్ సింగ్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఉట్నూర్ సీఐ ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంవై వీ3ఏడీఎస్ అప్లికేషన్‌లో జాయిన్ అయి యాడ్ చూస్తూ మీకు డబ్బులు వస్తాయని ఆశచూపించి బోయవాడకు చెందిన అలీ వద్ద రూ.1,20,000, రమేశ్ వద్ద రూ.1,20,000 తీసుకుని మోసగించినట్లు ఆయన పేర్కొన్నారు. బాధితులెవరైనా ఉంటే ఉట్నూర్ పోలీస్ స్టేషన్‌కు వచ్చి సంప్రదించాలని సూచించారు. ఆన్‌లైన్ గేమింగ్, మార్కెటింగ్ తదితర వాటికి లొంగి మోసపోవద్దన్నారు.

మందమర్రి ఏరియా జీఎంగా రాధాకృష్ణ



రాధాకృష్ణ

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియా జీఎంగా కార్పొరేట్ ఎస్టేట్ జీఎంగా విధులు నిర్వహిస్తున్న ఎస్.రాధాకృష్ణను నియమిస్తూ సింగరేణి యాజమాన్యం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటి వరకు మందమర్రి ఏరియాలో జీఎంగా విధులు నిర్వహిస్తున్న దేవేందర్ 45 రోజుల పాటు సెలవులో వెళ్లారు. రాధాకృష్ణను డైరెక్టర్ (పీఅండ్‌పీ)కు రిపోర్ట్ చేయాలని ఉత్తర్వులో పేర్కొన్నారు.

మార్కెటింగ్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి



ఎస్పీ అఖిల్ మహాజన్

కైలాస్‌నగర్: మల్టీ లెవల్ మార్కెటింగ్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అమాయక ప్రజలను అధిక లాభాల ఆశ చూపి మోసం చేస్తున్న వారిపై కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. ఉట్నూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బోయవాడకు చెందిన ఠాగూర్ విజయ్ సింగ్ myv3ads అనే అప్లికేషన్‌లో నమోదై దాని ద్వారా డబ్బులు సంపాదించవచ్చని ఆశ చూపి, అందులో నమోదయ్యేందుకు రూ.1,21,000 చెల్లించాలని ఇద్దరికి ఆశచూపి మోసం చేశాడన్నారు. బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి విచారణ చేపట్టి శుక్రవారం నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు. ఇంకా ఈ అప్లికేషన్ ద్వారా మోసపోయిన బాధితులు ఎవరైనా ఉంటే నిర్భయంగా జిల్లా పోలీసు యంత్రాంగాన్ని సంప్రదించవచ్చన్నారు.

ఆలోచన.. ఆవిష్కరణ

- కాగజ్‌నగర్‌లో విభాగ్ స్థాయి గణిత విజ్ఞాన మేళా
- ఆలోచింపజేసిన చిన్నారుల ప్రాజెక్టులు
- శాస్త్రీయ దృక్పథం పెంచుకోవాలని అతిథుల సూచన



బహుమతులు అందుకున్న విద్యార్థులు

కాగజ్‌నగర్‌టౌన్: విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించేందుకు జ్ఞాన విజ్ఞాన మేళాలు ఎంతగానో ఉపయోగపడతాయని శ్రీ సరస్వతి శిశుమందిర్ మంచిర్యాల జిల్లా విభాగ్ కార్యదర్శి దహెగాం గోవింద్‌రావు అన్నారు. శనివారం కాగజ్‌నగర్‌లోని ఆదర్శనగర్ శ్రీ సరస్వతి శిశుమందిర్ పాఠశాలలో విభాగ్ స్థాయి గణిత జ్ఞాన విజ్ఞాన మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థులు కొత్త ప్రయోగాలు, ఆవిష్కరణలకు ఊతమిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగివున్న శాస్త్ర సాంకేతిక ప్రతిభను వెలికితీయడంలో గణిత జ్ఞాన విజ్ఞాన మేళాలు కీలక పాత్ర పోషిస్తాయన్నారు. అనంతరం, విద్యార్థులు ప్రదర్శించిన ఆవిష్కరణలను తిలకించి పలువురిని ఆలోచింపజేసేలా ఉన్నాయని ప్రశంసించారు. మేళాలో మంచిర్యాల, ఆసిఫాబాద్, బెల్లంపల్లి, గోదావరిఖని, శ్రీరాంపూర్, పెద్దపల్లి నుంచి శిశువర్గ, బాలవర్గ, కిశోరవర్గాల నుంచి విద్యార్థులు 236 మంది హాజరై ఆవిష్కరణలను ప్రదర్శించారు. ఇందులో ప్రతిభ కనబర్చిన వారు రాష్ట్రస్థాయిలో నిర్వహించే పోటీల్లో పాల్గొంటారని నిర్వాహకులు పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయి మేళాకు ఎంపిక

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని సరస్వతీ శిశు మందిర్ పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి విజ్ఞాన మేళాకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు కోటేశ్వర్‌రావు తెలిపారు. శనివారం కాగజ్‌నగర్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి విజ్ఞాన మేళాలో శార్వాణి, వెంకట రత్న, చరణ్, సాకేత్, హరిచరణ్, దివ్య, జశ్వంత్, నిహారిక, విక్రమ్, శ్రీనిధి ఉత్తమ ప్రతిభ కనబరిచి బహుమతులు అందుకున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులు సెప్టెంబర్ 3నుంచి 5వ తేదీ వరకు కామారెడ్డిలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి విజ్ఞాన మేళాలో పాల్గొంటారని వివరించారు.

బొగ్గుతో విద్యుత్ ఉత్పత్తి



బొగ్గును వినియోగించి విద్యుత్‌ను ఎలా తయారు చేయాలి? తయారైన విద్యుత్‌ను ఎలా స్టోరేజ్ చేయాలనే అంశంపై ప్రాజెక్టు తయారు చేశా. దీని ద్వారా తక్కువ ఖర్చుతో ఎక్కువ విద్యుత్ ఉత్పత్తి చేసి స్టోర్ చేసుకోవచ్చు.

– వి.సాన్విక, 7వ తరగతి, గోదావరిఖని

జియోమెట్రిక్ షేప్స్



గణితంలోని జియోమెట్రిక్ షేప్స్ మానవ జీవితంలో వినియోగించే ప్రతీ పనిలో ఉంటాయి. ఇంటి నిర్మాణాలు త్రిభుజాకారం, దీర్ఘచతురస్రాకారం, చతురస్రాకారం, గోలం, తదితర ఆకారాల్లో ఉంటాయి. ప్రతీ దానిలో గణితం ఆకారాలు ఇమిడి ఉన్నాయి.

– శ్రీ వైష్ణవి, 3వ తరగతి, ఆదర్శనగర్, కాగజ్‌నగర్

మోడల్ బేస్డ్ ఆన్ అగ్రికల్చర్



కాలానుగుణంగా వ్యవసాయం ఎలా చేయాలో తెలిపే మోడల్ బేస్డ్ ఆన్ అగ్రికల్చర్ ప్రాజెక్టును తయారు చేశా. మట్టి, వివిధ రకాల ధాన్యాలను ఎంచుకుని మట్టిలో కాలానుగుణంగా ఏవిధంగా వేయాలో తెలిపే ప్రయోగం తయారుచేశా. ఇందుకు సహకరించిన ఆచార్యులకు ధన్యవాదాలు.

– వొడ్డపల్లి ఆయుష్, 4వ తరగతి, ద్వారకానగర్, కాగజ్‌నగర్

వర్షపు నీటిని నిల్వ చేసుకునేలా..



ఇంటి ఆవరణలో, ఇంటి పైకప్పుపైన ట్యాంక్ ఏర్పాటు చేసుకోవాలి. వర్షపు నీరు అందులో స్టోరేజీ అయ్యేలా చూసుకోవాలి. స్టోరేజ్ అయిన నీటిని మూడు పద్ధతుల్లో వేరు చేసి ఇంటి అవసరాలకు వాడుకునేలా ప్రాజెక్టు చేశా.

– ఈ.సాకేత్, కాగజ్‌నగర్ ,4వ తరగతి

సంతానం కలుగడంలేదని ఉపాధ్యాయురాలు ఆత్మహత్య



కవిత (ఫైల్)

కాగజ్‌నగర్‌టౌన్/కౌటాల: సంతానం కలుగడంలేదనే మనస్తాపంతో ఉపాధ్యాయురాలు ఆత్మహత్య చేసుకున్న సంఘటన పట్టణంలో చోటు చేసుకుంది. ఎస్సై సుధాకర్ తెలిపిన వివరాల మేరకు కాగజ్‌నగర్ పట్టణంలోని ఎల్లగౌడ్‌తోటకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయురాలు మిడిదొడ్డి కవిత (41)కు ఐదేళ్లక్రితం చరణతో వివాహమైంది. సదరు ఉపాధ్యాయురాలు కౌటాల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సైన్స్ టీచర్‌గా విధులు నిర్వహిస్తోంది. ఇప్పటి వరకూ సంతానం కలుగకపోవడంతో పాటు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. ఆరోగ్యం నయం కాకపోవడంతో పాటు సంతానం లేకపోవడంతో మనస్తాపం చెందింది. శుక్రవారం రాత్రి భర్త బయటకు వెళ్లిన సమయంలో ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుంది. బయట నుండి వచ్చిన భర్త పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతురాలి అన్న రాజేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

జ్వరంతో బాలుడు మృతి



సీతారాం (ఫైల్)

తిర్యాణి: జ్వరంతో బాలుడు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు గిన్నెదరి గ్రామానికి చెందిన ఆడ రాము కుమారుడు సీతారాం(15) పదిహేను రోజులుగా జ్వరంతో బాధపడుతున్నాడు. కుటుంబ సభ్యులు మండల కేంద్రంలోని సీహెచ్‌సీలో చికిత్స అందించినా తగ్గకపోవడంతో మూడు రోజుల క్రితం మంచిర్యాలలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారు జామున మృతి చెందాడు. మూడు రోజుల వ్యవధిలోనే మండలంలోని ఇద్దరు పిల్లలు జ్వరంతో చనిపోవడంతో ప్రజల్లో భయాందోళన నెలకొంది.

సింగరేణి పరిరక్షణకు కలిసిరావాలి

- హెచ్‌ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్

శ్రీరాంపూర్: సింగరేణిని పరిరక్షించుకోవడానికి కార్మికులంతా కలిసి రావాలని హెచ్‌ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ పిలుపునిచ్చారు. శనివారం నస్పూర్ కాలనీలోని గోదావరి ఫంక్షన్ హాల్‌లో హెచ్‌ఎంఎస్ 26వ ద్వైపాక్షిక మహాసభలు ప్రారంభమయ్యాయి. యూనియన్ జెండా ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ సింగరేణిలో కొత్త గనులు రాకపోవడం వల్ల సంస్థ భవిష్యత్తు ప్రమాదంలో పడిందన్నారు. నూతన గనులు వస్తేనే సింగరేణికి భవిష్యత్ ఉంటుందని, దీని కోసం కార్మికవర్గం పోరాడాలన్నారు. కార్మికుల హక్కుల సాధనకోసం తెలంగాణ జాగృతి నాయకురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితతో కలిసి పనిచేస్తున్నామన్నారు. కవితను యూనియన్ గౌరవ అధ్యక్షురాలిగా నియమించుకోబోతున్నట్లు తెలిపారు. ఆదివారం జరిగే సభలో నూతన కమిటీ ఎన్నికలు, పలు తీర్మానాలు చేస్తామన్నారు. సమావేశంలో యూనియన్ సింగరేణి విభాగం అధ్యక్షుడు తిప్పారపు సారయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ గడిపల్లి కృష్ణప్రసాద్, శ్రీరాంపూర్ ఏరియా ఉపాధ్యక్షుడు అనిల్ రెడ్డి, కార్యదర్శి పానగంటి అశోక్, 12 ఏరియాల ఉపాధ్యక్షులు, కార్యదర్శులు, సెంట్రల్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ పునరుద్ధరించాలి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని తెలంగాణ ఉద్యోగుల జేఏసీ జిల్లా కన్వీనర్ వి.ప్రభాకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో సంఘ భవనంలో పాత పెన్షన్ సాధన పోరాట సభ పోస్టర్‌ను శనివారం విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలనే ఉద్దేశంతో సెప్టెంబర్ 1న ఐడీవోసీ కార్యాలయంలో నిర్వహించే సభను విజయవంతం చేయాలని కోరారు. 2004 సెప్టెంబర్1 తర్వాత నియమితులైన ప్రభుత్వ ఉద్యోగుల పాత పెన్షన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 1న మధ్యాహ్న భోజన విరామంలో ప్రభుత్వ ఉద్యోగులు కలెక్టరేట్‌లో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపాలన్నారు. కార్యక్రమంలో జేఏసీ గౌరవ అధ్యక్షుడు ఎంసీ.లింగన్న, గెజిటెడ్ ఉద్యోగుల సంఘం కార్యదర్శి రమేశ్, ఉపాధ్యాయ ఉద్యోగ సంఘం నాయకులు మురళీమనోహర్‌రెడ్డి, జుట్టు గజేందర్, రవికాంత్, భూమన్న యాదవ్, లక్ష్మణ్, అశోక్, నాలుగో తరగతి ఉద్యోగ సంఘ అధ్యక్ష కార్యదర్శులు రవి, గణేశ్ పాల్గొన్నారు.

భీమన్న ఆలయంలో చోరీ



ఆలయంలో పరిశీలిస్తున్న ఎస్సై

సోన్: మండలంలోని కూచన్‌పల్లి గ్రామ సమీపంలో ఉన్న న్యాకపు కులస్తుల ఆరాధ్య దైవమైన భీమన్న ఆలయంలో గురువారం చోరీ జరిగిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. శనివారం గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్సై గోపి సంఘటన స్థలానికి చేరుకుని ఆలయ పూజారి దేశి నరసు అడిగి తెలుసుకున్నారు. 40 గ్రాముల వెండి ఆభరణాలు, రూ.2వేల నగదు చోరీకి గురైనట్లు తెలిపారు. గ్రామస్తులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

నిబంధనల ప్రకారం భూసేకరణ చేపట్టాలి



మాట్లాడుతున్న డైరెక్టర్ పీపీ గౌతమ్

జైపూర్: సింగరేణి పరిధిలో భూసేకరణ ప్రక్రియ నిబంధనల ప్రకారం చేపట్టాలని సింగరేణి సంస్థ సిబ్బంది, పరిపాలన, సంక్షేమ విభాగ డైరెక్టర్ గౌతమ్ పొట్రు అన్నారు. జైపూర్ మండల కేంద్రంలోని ఎస్టీపీపీ ప్రాణహిత అతిథి గృహంలో శనివారం మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్, పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీహర్షతో కలిసి సింగరేణి ఏరియా జనరల్ మేనేజర్లు, ఎస్టేట్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ భూయాజమానులు, సింగరేణి సంస్థ సమన్వయంతో వ్యవహరించాలన్నారు. ఎలాంటి పొరపాట్లు లేకుండా భూసేకరణ ప్రకియ నిర్వహించాలన్నారు.

నీటమునిగిన శ్మశానవాటిక



గోదావరి నీటిలో మునిగిన శ్మశానవాటిక

ఖానాపూర్: పట్టణంలోని గోదావరితీరంలో మున్సిపల్ నూతన కార్యవర్గం ఏర్పటయ్యాక రూ.50 లక్షలతో నిర్మించిన శ్మశనవాటిక ఏటా వర్షాకాలంలో నీట మునుగుతోంది. పాలకుల అనాలోచిత నిర్ణయాలతో ఏటా వరదలు తగ్గాక మరమ్మతు చేయడం పరిపాటిగా మారింది. శనివారం పట్టణంలోని 5వ వార్డులో ద్యావతి గంగాధర్(55) అనారోగ్యంతో మృతి చెందాడు. గోదావరి తీరంలో గల శ్మశానవాటికకు తీసుకెళ్లాల్సి ఉండగా ఉండగా కుటుంబ సభ్యులు అత్యంత దూరభారమైనప్పటికీ గాంధీనగర్ శివారులోని తర్లపాడ్ వెళ్లే రహదారి వరకు తీసుకెళ్లి ఖననం చేశారు. ఇప్పటికైనా శ్మశానవాటిక సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు.

మరమ్మతుల నేపథ్యంలో పలు రైళ్లు రద్దు

ఆదిలాబాద్: ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్న రైలు పట్టాలను సరిచేస్తున్న నేపథ్యంలో పలు రైళ్లను పాక్షికంగా రద్దు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో శ్రీధర్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కామారెడ్డి జిల్లాలో భారీ వర్షాల నేపథ్యంలో హైదరాబాద్ డివిజన్ పరిధిలోని భిక్కనూరు–తల్మాడ సెక్షన్, అక్కన్నపేట–మెదక్ సెక్షన్‌లో రైలు పట్టాలపై భారీగా వరద నీరు ప్రవహించడంతో అక్కడ మరమ్మతు పనులు కొనసాగుతున్నాయి. వీటిని దృష్టిలో ఉంచుకుని తిరుపతి–ఆదిలాబాద్ మధ్య నడిచే కృష్ణా ఎక్స్‌ప్రెస్‌ను శనివారం చర్లపల్లి–ఆదిలాబాద్ మధ్య పాక్షికంగా రద్దు చేసినట్లు తెలిపారు. పర్లి–ఆదిలాబాద్ మధ్య నడిచే 77615 రైలు సర్వీస్, ఆదిలాబాద్–పూర్ణ మధ్య నడిచే 77616 రైల్ సర్వీసులు సెప్టెంబర్ 1న రద్దు చేసినట్లు వివరించారు. ఈ విషయాన్ని రైలు ప్రయాణికులు గమనించాలని సూచించారు.

'నూతన జాతీయ విద్యావిధానాన్ని వ్యతిరేకించాలి'



మాట్లాడుతున్న ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ

మంచిర్యాలఅర్బన్: నూతన జాతీయ విద్యావిధానాన్ని వ్యతిరేకిస్తూ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేయాలని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. శనివారం మార్క్స్‌భవన్‌లో పీడీఎస్‌యూ రాష్ట్ర విద్య, వైజ్ఞానిక, రాజకీయ శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పురాతన పురాణాలపై ఆధారపడి నూతన జాతీయ విద్యావిధానాన్ని రాసినట్లు చెప్పుకుంటున్న బీజేపీ ప్రభుత్వం వర్ణ వ్యవస్థ ఆధారిత విద్యను అమలు పరిచేందుకు ఉవ్విళ్లూరుతోందని ఆరోపించారు. దేశంలో 10 లక్షల టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, దేశ జీడీపీలో 2.5 శాతం మాత్రమే విద్యకు నిధులు కేటాయిస్తున్నారన్నారు. తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర బడ్జెట్‌లో 15శాతం నిధులు కేటాయిస్తామని చెప్పి మాటమార్చిందన్నారు. అంతకుముందు పీడీఎస్‌యూ జెండాను రాష్ట్ర అధ్యక్షుడు ఎస్‌వీ శ్రీకాంత్ ఎగురవేశారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి నాగరాజు, తెలంగాణ అసిస్టెంట్ ప్రొఫెసర్ సరిత, ఐఎఫ్‌టీయూ జాతీయ ప్రధాన కార్యదర్శి టి.శ్రీనివాస్, పూర్వ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి లాల్‌కుమార్, పీడీఎస్‌యూ జాతీయ నాయకులు మహేష్, రాష్ట్ర ఉపాధ్యక్షులు మధు, రాజేశ్వర్, కిరణ్, సహాయ కార్యదర్శులు గౌతమ్‌కుమార్, మస్తాన్, నవీన్, అజయ్, తిరుపతి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రెడ్డి చరణ్, డి.శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



ఎంపికైన ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ జట్టు

మందమర్రిరూరల్: పట్టణంలోని సింగరేణి హైస్కూల్ మైదానంలో శనివారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బాలబాలికల హ్యాండ్‌బాల్ క్రీడా పోటీలు నిర్వహించారు. బాలికల జట్టులో గంగుబాయి, మౌనిక, వైష్ణవి, పార్వతి, జయశ్రీ, సహస్ర మోక్షిత, బాలుర జట్టులో సాత్విక్, రుత్విక్‌వర్మ, జాషువా, ప్రణయ్, వంశీ, పార్థు ఎంపికై నట్లు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కనపర్తి రమేశ్ తెలిపారు. హైదరాబాద్‌లో ఆదివారం జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో క్రీడాకారులు పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో కోచ్ సునార్కర్ అరవింద్, పీడీ సంతోష్, పీఈటీ రాధారాణి, సీనియర్ క్రీడాకారులు ప్రణయ్, సంజయ్, రఘు, వర్మ, అమూల్య, తదితరులు పాల్గొన్నారు.

లక్షలాది మంది జీవితాల్లో వెలుగులు



పుస్తకం ఆవిష్కరిస్తున్న ఎంపీ, కలెక్టర్, ఎస్పీ

జైనూర్: సద్గురు పూలాజీబాబా తన హితబోధనలతో లక్షలాది మంది జీవితాల్లో వెలుగులు నింపిన మహనీయుడని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, ఎస్పీ కాంతిలాల్ పాటిల్, ఎంపీ గోడం నగేష్ అన్నారు. శనివారం మండలంలోని పట్నాపూర్‌లోని సిద్ధేశ్వర సంస్థాన్‌లో పూలాజీబాబా 101వ జయంతి వేడుకలు అధికారికంగా నిర్వహించారు. బాబా సమాధి మందిరంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో అన్ని వర్గాలను ఏకతాటిపై తీసుకువచ్చి ఆధ్యాత్మిక మార్గం వైపు నడిపించిన ఘనత బాబాకే దక్కుతుందన్నారు. తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని ఎన్నో కుటుంబాలు బాబా చూపిన మార్గంలో నడుస్తున్నాయన్నారు. అనంతరం మాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుకుమార్ పెట్కులే రచించిన బాబా చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కిన్వట్ ఎమ్మెల్యే భీంరావ్ కేరామ్, మహారాష్ట్ర మాజీమంత్రి శివాజీరావు, మాజీ ఎమ్మెల్యే ఉత్తంరావు ఇంగ్లే, మహారాష్ట్ర స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాందాస్, ఆసిఫాబాద్ నియోజక వర్గ ఇన్‌చార్జి శ్యాంనాయక్, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఆత్రం సుగుణ, మార్కెట్ కమిటీ చైర్మన్ కుడ్మేత విశ్వనాథ్, ఆదిలాబాద్ గ్రంథాలయ చైర్మన్ నర్సయ్య, ఆదిలాబాద్ డీఎస్పీ రఘునాథ్, రెవెన్యూ జిల్లా అధికారి లోకేశ్వరరావు, విద్యుత్ శాఖ ఎస్సీ ఆడే శేషరావు పాల్గొన్నారు.

ముగిసిన అభ్యంతరాల స్వీకరణ



మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఎంపీడీవో ప్రసాద్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో భాగంగా జిల్లాలో మండల స్థాయిలో అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు శనివారం ముగిసాయి. ఓటరు జాబితా, పోలింగ్ కేంద్రాలకు సంబంధించి అభ్యంతరాల స్వీకరణ సైతం ముగిసింది. జిల్లాలోని పలు గ్రామాల నుంచి 515 అభ్యంతరాలు వచ్చాయి. ఓటరు పోలింగ్ కేంద్రాలు, వార్డు మార్పు, తప్పిపోయిన ఓటరుకు సంబంధించి ఎక్కువగా వచ్చినట్లు తెలుస్తోంది. జన్నారం మండలంలో 23, దండేపల్లిలో 104, లక్సెట్టిపేటలో 30, హాజీపూర్‌లో 12, జైపూర్‌లో 88, భీమారంలో 58, చెన్నూర్‌లో 2, కోటపల్లిలో 3, వేమనపల్లిలో 1, మందమర్రిలో 18, కాసిపేటలో 93, బెల్లంపల్లిలో 27, తాండూర్‌లో 42, భీమినిలో 5, నెన్నెలలో 7, కన్నెపల్లిలో 2 అభ్యంతరాలకు సంబంధించి దరఖాస్తులు వచ్చాయి. కాగా, శనివారం హాజీపూర్ మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో అన్ని పార్టీల ప్రతినిధులతో ఎంపీడీవో ప్రసాద్, తహసీల్దార్ శ్రీనివాస్‌రావు దేశ్‌పాండే సమావేశం అయ్యారు.

15 లీటర్ల గుడుంబా స్వాధీనం



దాడులు నిర్వహిస్తున్న పోలీసులు

గుడిహత్నూర్: మండలంలోని నేరడిగొండ తండాలో శనివారం దాడులు నిర్వహించి 15 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. రాథోడ్ రమేశ్, రాథోడ్ రోహిదాస్, రాథోడ్ కృష్ణ, ఆడే లక్ష్మీబాయిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రెండు గ్రామాల్లో..

బోథ్: మండలంలోని నిగిని, కంటెగాం గ్రామాల్లో దాడులు నిర్వహించి ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీసాయి తెలిపారు. నిగిని గ్రామంలో ఆడె గనియా ఇంట్లో లీటరు గుడుంబా, 19 కిలోల ఇప్పపువ్వు, కంటెగాంలో ఆడె దత్తు ఇంట్లో లీటరు గుడుంబా, 20 కిలోల ఇప్పపువ్వు, రాథోడ్ దత్తు ఇంట్లో లీటరు గుడుంబా, 25 కిలోల ఇప్పపువ్వు లభ్యమైనట్లు ఎస్సై తెలిపారు. వారిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

గుడుంబా స్థావరాలపై దాడులు

ఇచ్చోడ: మండలంలోని జామిడి, జల్దా, సిరిచెల్మ గ్రామాల్లోని గుడుంబా స్థావరాలపై శనివారం దాడులు నిర్వహించినట్లు ఎస్సై పురుషోత్తం తెలిపారు. జామిడిలో రాథోడ్ రాజు వద్ద 10 లీటర్ల నాటుసారా, జల్దాలోని పునీబాయి వద్ద 2 లీటర్లు, సిరిచెల్మలోని గుండాల బాపు వద్ద 2 లీటర్ల ఇప్పపువ్వు సారా స్వాధీనం చేసుకుని ముగ్గురిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

అదుపుతప్పి ఆటో బోల్తా

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని ఖండాల అటవీ ప్రాంతంలో శనివారం అదుపుతప్పి ఆటో బోల్తా పడింది. స్థానికులు, 108 సిబ్బంది తెలిపిన వివరాల మేరకు బేల మండలానికి చెందిన పలువురు ఆదిలాబాద్ రూరల్ మండలంలోని పాటగూడలో జరిగే అంత్యక్రియలకు ఆటోలో బయలుదేరి వెళ్లారు. తిరుగుప్రయాణంలో ఖండాల అటవీ ప్రాంతాంలో అదుపుతప్పి ఆటో బోల్తా పడింది. దీంతో అందులో ప్రయాణిస్తున్న పలువురు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. క్షతగాత్రులను 108లో జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రికి తరలించినట్లు ఈఎంటీ కార్తీక్ సింగ్, పైలట్ విఠల్ గౌడ్ తెలిపారు.